

# రమణ భాస్కర

ఆధ్యాత్మిక పక్షపత్రిక

20-4-2001 (9)



## శ్రీ రమణ క్షేత్రం - జిన్నూరు

పశ్చిమ గోదావరి జిల్లా - ఆంధ్రప్రదేశ్. పిన్ : 534 265

# సద్గురు శ్రీనాన్న గారి అనుగ్రహ భాషణములు

**22-4-2001, ఆదివారం** జిన్నూరు - శ్రీ రమణ క్షేత్రం

**26-4-2001 నుండి 29-5-2001 వరకు** కేంపు

**30-5-2001, బుధవారం** జిన్నూరు - శ్రీ రమణ క్షేత్రం



## సత్యాన్వేషణ - సత్యదర్శనం

ది.13-4-2001న, **సత్యాన్వేషణ - సత్యదర్శనం** పుస్తకం ఆవిష్కరణ మహోత్సవం, భీమవరం, అల్లూరి సీతారామరాజు కళ్యాణ మంటపంలో, శ్రీ ఉద్దరాజు ఆనందరాజు గారి 22వ వర్ధంతి సందర్భంగా, జరిగిన సభలో జరిగింది. ఈ సభకు శ్రీ రామలింగరాజు గారు (అడ్వకేట్), అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా సద్గురు శ్రీ నాన్నగారు విచ్చేసినారు. **సత్యాన్వేషణ - సత్యదర్శనం** పుస్తకమును డా. ఎ. రామకృష్ణంరాజు, M.D., గారు ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా జరిగిన సభలో సద్గురు శ్రీ నాన్నగారు మాట్లాడుతూ, శ్రీ ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు గారు, వారి సోదరులకు తల్లితండ్రులపట్ల ఉన్న కృతజ్ఞతాభావాన్ని కొనియాడారు. శ్రీ విశ్వనాథరాజు గారు భీమవరం ప్రజలకు శాశ్వతంగా ఉపయోగించే పని ఏదైనా చేపట్టాలని సద్గురు శ్రీ నాన్నగారు సూచించారు. "సత్యాన్వేషణ - సత్య దర్శనం" పుస్తకం గురించి మాట్లాడుతూ, వదలవలసింది వదిలినప్పుడు, సత్యం మన చేతికి దొరుకుతుందని, సద్గురు శ్రీ నాన్నగారు ప్రవచించారు.

నర్సాపురం డా॥ శ్రీ పి.వి.యస్. సూర్యనారాయణరాజు గారు వ్రాసిన ఈ పుస్తకం అచ్చు వేయడానికి శ్రీ ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజుగారు, వారి సోదరులు 30 వేలు ఖర్చుపెట్టి, అచ్చువేసిన రెండు వేల కాపీలను జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం వారికి అందించారు.



ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 6 సంచిక : 9 పుష్పం : 26-28 20-4-2001

**RAMANA BHASKARA**
**TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE**
PAGES : 12

**VOL: 6** **ISSUE: 9**

EDITOR
**P. S. RAMA RAJU**
EDITING
**P.H.V. SATYAVATHI (HYMA)**

**SUBSCRIPTION**
YEARLY : **Rs. 140/-**
Each Copy : **Rs. 10/-**

ADDRESS
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
JINNURU - 534 265
W.G.Dt., A.P.

**PUBLISHER**
P.S.RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
ULLAMPARRU - PALAKOL
☎ 08814 - 24589, 24689

**PRINTER**
SHRIRAM GRAPHICS
BANK STREET - PALAKOL
☎ 08814 - 22438, 24278

## ప్రపంచము మనమే, ఇతరులలో దోషములు మనలో దోషములే

అనంతమైన మన మౌన స్వరూపంలో సృష్టి చిన్న శబ్ధము. మనస్సు మనలోనే ఉన్నది. మనస్సు ఆభాసకాంతితో చేరికయినపుడు, మనస్సులో ఉన్న రజోగుణము చూచేవాడిగను (అహం), మనస్సులో ఉన్న తమోగుణము చూడబడేదిగను అగును. (ఇదం), అందుచేతనే మనలో ఉన్నవే బయటకూడా కనబడును. ఉదాహరణకు శరీరము పంచభూతాత్మకము, ప్రపంచము కూడా పంచభూతాత్మకము. పంచభూతాత్మకమైన శరీరము సహాయము లేకుండా ఎవరైనా ప్రపంచమును చూసినారా! అందుచేత దేహము, చూచే మనస్సు, ప్రపంచము, ఒకదానిమీద ఒకటి ఆధారపడ్డవి, ఇవన్నీ ఒకే క్రమములోనివి. అందుచేత మనమే ప్రపంచము, మనస్సులో విషయాలే ఇతరములుగా బేధబుద్ధి వల్ల అనిపిస్తాయి. వాస్తవముగా పరిశీలిస్తే ఇతరములు మనలోనివే. ఇతరులు మన మనస్సులో వారే. యదార్ధానికి అంతరము, బాహ్యము అని రెండు లేవు. అహము, ఇదం కలిసి మనస్సు, మనస్సు మనలో ఉన్నది. అందుచేత సర్వము మనలోనే ఉంది. సామాన్యముగా చాలామందికి, ఇతరులలో దోషములు ఎంచటం ఒక అలవాటు. ఇతరులు మన మనస్సులో వారే అని తెలిసినపుడు, వారిలో ఉన్న దోషములు, మనలో ఉన్న దోషములు అని అనుభవంలో తెలుస్తుంది. మనలో ఉన్న దోషములను, ఇతరులవి అని పేరుపెట్టి వారిమీద ఆపాదిస్తాము. మనమే ఇతరములు కనుక, మన మనస్సును మనం సంస్కరించుకొంటే, మనస్సే సర్వసృష్టి గనుక, మనస్సు సంస్కరింపబడిన ప్రభావం సర్వసృష్టిమీద ఉంటుంది. దీనికి విచారణ ఒకటే మార్గము.

.... ఎడిటర్

**ఈ సంచికలో............**

సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు

21-03-2001 యండగండి .................... 2
02-04-2001 పాలకొడేరు .................... 6
25-03-2001 కోపెల్ల .................... 10

# పట్టుకోవలసిన నేనును వదిలివేశావు, వదిలి వెయ్యవలసిన నేనును పట్టుకున్నావు

సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 21-3-2001, యండగండి

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఆధ్యాత్మిక జీవితం అనేది దైనందిన జీవితంలో చాలా అవసరం. అది మరణానంతరం ఉపయోగపడేది అని అనుకోవద్దు. మీ దైనందినజీవితంలో ఆధ్యాత్మికజీవితం ఎంతో ఉపమోగపడుతుంది. సుఖంగా, శాంతిగా జీవించటానికి ఆధ్యాత్మిక జీవితం యొక్క సపోర్టు మనకు అవసరం. మనం కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి. దేహానికి మరణం ఎప్పుడు వస్తుందో చెప్పలేము. దేహానికి మరణం రాకముందే మనం దేహబుద్ధి నుండి విడుదల పొందితే ఇంక పునర్జన్మ రాదు. మీ ఇంటిపనులు అయినతరువాత మిగిలిన కాలంలో జపంగాని, ధ్యానంగాని చేసుకోవాలి. అది మీ మనోవికాసానికి దారితీస్తుంది. మీ ఖర్చులు పోను మిగిలినడబ్బు బాంక్‌లో వేసుకొంటారు. అలాగే మీ పనులు అయిన తరువాత కొంతకాలం మిగులుతుంది కదా ఆ మిగతా కాలాన్ని దేవునిబాంక్‌లో వేసుకోవటానికి ప్రయత్నం చేయాలి. ఇక్కడ బాంక్‌లో వేసుకొన్న డబ్బు మీకూడారాదు. దేవునిబాంక్‌లో వేసుకొన్నది మరణానంతరం నీకూడా వస్తుంది. అంటే దేవునిబాంక్‌లో ఆధ్యాత్మికధనం వేసుకోవాలంటే ఏమి చేయాలి? మీ ఇంటిదగ్గర పమలు శ్రద్ధగా చేసుకొంటూ, నిర్మలంగా చేసుకొంటూ మిగిలిన కాలాన్ని జపంతోటి, ధ్యానంతోటి సద్వినియోగం చేసుకోవాలి. దేవుడే మన పుట్టుక, దేవుడే మన చావుకూడా. ఏ దేవుడు అయితే మనలను ఈ శరీరంలోనికి తీసుకొని వచ్చాడో ఆ దేవుడే మనలను ఈ శరీరంలోనుండి తీసుకొనిపోతాడు. ఆయనే మన పుట్టుక, ఆయనే మన చావు అనుకొన్నప్పుడు ఇంక దుఃఖపడటానికి ఏముంది? మనం సాత్వికబుద్ధిని అలవర్చుకోవాలి. మనకు అవగాహనాశక్తి లేకపోతే అశాంతి మనలను విడిచిపెట్టదు.

మీరు ఏమతస్థులైనా, మీరు ఏ దేవుడిని ఆరాధించినా, మీరు ఏ గురువును ఆశ్రయించినా మాకు ఎట్టి సంబంధం లేదు. మీరు పొందవలసిన విషయం చెపుతున్నాను. మీ అందరి హృదయాలలో నేను ఉన్నాను. నా హృదయంలో మీరు అందరూ ఉన్నారు. మీరు, నేను ఒక్కటే కాని బేదబుద్ధిని మనస్సు కలుగజేస్తోంది. మీ అందరి హృదయాలలో నేను ఉన్నాను, నా హృదయంలో మీరు ఉన్నారు అనేది అనుభవంలోనికి రావాలంటే బేధబుద్ధి నశించాలి. పొందవలసింది లోపలే ఉందిగాని బయట ఏమీలేదు. దానిని పొందటానికి ఏ ఆటంకాలు ఉన్నాయో, ఏ అడ్డంకులు ఉన్నాయో వాటిని సృష్టి నీకు చూపిస్తూ ఉంటుంది. వాటిని జాగ్రత్తగా గమనించి, వాటిని తొలగించుకోగలిగితే చేతిలో ఉన్న వస్తువును వదిలేస్తే

అది భూమిమీద ఎలా పడిపోతుందో అలాగే నీ మనస్సు వెళ్ళి హృదయగుహలో పడిపోతుంది. ఎక్కడికి వెళ్ళినా జీవితం ఉంటుంది. ఎక్కడికి వెళ్ళినా ఇష్టాలు, అయిష్టాలు, ఘర్షణలు, అసూయ, సమాజం ఉంటాయి. ఈ సమాజంలో ఉంటూ సమాజాన్ని అతిక్రమించాలిగాని సమాజంనుండి పారిపోయి సమాజాన్ని అతిక్రమించలేము. ఏదైనా కష్టం వస్తే దానిని పరిష్కారం చేసుకోలేరు అనుకోండి భరించటం నేర్చుకోండి, పారిపోవటం మంచిదికాదు. ఎందుచేతనంటే భరించటం వలన సహనం పెరుగుతుంది. ఎప్పుడయితే సహనం పెరిగిందో హృదయం యొక్క లోతులు పెరుగుతాయి. సహనాన్ని ప్రాక్టీసు చేసేకొలది, సాత్వికబుద్ధిని ప్రాక్టీసుచేసే కొలది లోపలఉన్న పరమేశ్వరుడు నీకు ఎరుకపడతాడు. ఎవడు మహాపాపి అంటే దేహబుద్ధి ఉన్నవాడు మహాపాపి అని చెప్పారు. ఆత్మబుద్ధి ఉన్నవాడు మహాపుణ్యాత్ముడు, దేహబుద్ధి ఉన్నవాడు మహాపాపి. దేహబుద్ధిని వదిలిపెట్టగలిగితే శాస్త్రవాసన, లోకవాసన అవే కొట్టుకొనిపోతాయి. ఒకనదిని ఈవైపు నుండి ఆవైపుకు జంప్‌చేయగల శక్తి నీకు ఉంది అనుకో ఒకకాలువను దాటటం ఎంత తేలిక. అలాగే దేహబుద్ధిని నీవు విడిచిపెట్టగలిగితే శాస్త్రవాసన, లోకవాసన అవే కొట్టుకొనిపోతాయి ఎందుచేతనంటే శాస్త్రవాసన, లోకవాసన దేహబుద్ధిలో ఇమిడి ఉన్నాయి.

ఇంట్లో పనులు అయిన తరువాత మీకు కొంతకాలం మిగులుతుంది. ఆ మిగిలిన టైములో జపం చేసుకొందాము, ధ్యానం చేసుకొందాము అనుకోకుండా లోకవిచారణతో కాలక్షేపం చేస్తున్నారు. ఇది భగవంతుడిని అగౌరవపరచినట్లు. ఎందుచేతనంటే భగవంతుడు కాలరూపంలో ఉన్నాడు. మనం ప్రయాణం చేసేటప్పుడు టిఫెన్లు తింటాము, కాఫీ త్రాగుతాము వాటికి మనకు టైము ఉంటుంది కాని భగవంతుని నామం చేయటానికి మనకు టైము లేదంటాము. అంటే లోపల మనకు భక్తి లేదు, శ్రద్ధలేదు అని అర్థం. ఈ మధ్య మా మనస్సు బాగాలేదు అంటాము అంటే లోపల ఏదో కోరిక ఉందని అర్థం. నిజమైన వైరాగ్యవంతునికి అసలు అశాంతే వాడికిరాదు. లోపల వైరాగ్యం పెట్టుకొని పనిచేస్తే అశాంతి రాదు. లోపల ఆశపెట్టుకొని పనిచేస్తే అశాంతి వస్తుంది. కోరికలోనుండి ఆశ వస్తుంది. ఆశలోనుండి అశాంతి వస్తుంది. అశాంతిలో నుండి దుఃఖం వస్తుంది. ఆత్మజ్ఞానం లేకపోతే దుఃఖం చల్లారదు. నీవుఎవరో నీకుతెలిసే వరకు దుఃఖం నిన్ను వెంటాడుతూనే ఉంటుంది. తలంపులు, కోరికలు, మంచి, చెడు, స్వర్గం, నరకం, స్నేహాలు, విరోధాలు అన్నీ మనస్సులోనే ఉన్నాయి. మనో నాశనం అవ్వకుండా నీకు బ్రహ్మానుభవం కలుగదు.

పట్టుకోవలసిన నేనును వదిలివేసావు, వదిలివేయవలసిన నేనును పట్టుకొన్నావు.

అందువలన ఈ తిరకాసు అంతా వస్తోంది. చావుకు, పుట్టుకకు, నీ వేదనకు ఇదే కారణం. ఏది వచ్చినా తలంపు రూపంలో వస్తుంది. స్నేహం, విరోధం, ఇష్టం, ప్రతిస్పందన అన్నీ తలంపు రూపంలో వస్తాయి. జపం చేస్తూ ఉంటే జపం చేసే తలంపు ఏమి చేస్తుంది అంటే మిగతా తలంపులను తరిమేసి, తరిమేసి చివరకు అదికూడా నశిస్తుంది అప్పడు భగవంతుడు తానుగా నీకు వ్యక్తమవుతాడు. నీలోపల ఉన్న వాసనలు పూర్తిగా నశించాలి. ఒక్కవాసన మిగిలి ఉన్నా నీకు పునర్జన్మ తప్పదు. అన్నివాసనలను శేషం లేకుండా విడిచిపెట్టాలి. ఈ మధ్య మాంసం తినటం మానివేసాము చుట్టాల ఇంటికి వెళితే వారు బలవంతం చేసారు తిన్నాము అని చెపుతారు. చుట్టాలు బలవంతం చేయటం వలన తిన్నామనటం అబద్దం వారిలో ఉన్న బలహీనత అలా అనిపిస్తోంది. ఇటువంటి చమత్కారాలకు ఈశ్వరుడు మోసపోడు. ప్రారబ్దంలో ఏపనిచేయవలసి ఉందో అది శ్రద్ధగా చెయ్యి, ఇష్టంగా చెయ్యి. నీ డ్యూటీ పట్ల నీకు భక్తి ఉండాలి. అప్పడు నీ మనస్సులో పాతవాసనలు పోతాయి, కొత్త వాసనలు రావు. పచ్చగడ్డి తినే దూడలు వట్టిగడ్డికోసం ఎదురుచూడవు అదేవిధంగా నీకు ఆత్మశాంతి లభ్యమయినప్పడు బాహ్యవిషయాల మీదకు నీ మనస్సు వెళ్ళదు. స్వతంత్రమైన ఆనందం, శాంతి పొందినప్పడు నీబుద్ధి చైతన్యంలో స్థిరంగా ఉండిపోతుంది. నీవు అసలు లేవు, ఉన్నాను అని అనుకొంటున్నావు. దానిమీద దుమ్ము చల్లు. కాని నీవు ఏమి చేస్తున్నావు అంటే దేవుడిమీద దుమ్ము చల్లుతున్నావు. దేవుడిమీద కాదు దుమ్ము చల్లవలసింది. వ్యక్తిగతమైన నేను మీద దుమ్ము చల్లు. దానిమీద దుమ్ముచల్లటం మానివేసి దానిని అలంకరిస్తున్నావు ఇంక అది ఎక్కడకు పోతుంది. పోనేపోదు. సత్యాన్వేషకుడు ఏమి చేస్తాడు అంటే తనలో ఉన్న సత్యం అనుభవంలోనికి రాకుండా, తనలో ఉన్న ఏ బలహీనతలు అడ్డువస్తున్నాయో చూసుకొని వాటిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేస్తాడు. మూలతలంపును ప్రధమ తలంపును దాని మూలంలోనికి పంపటం సాధ్యమా అని అనకండి. అది సాధ్యమే. సాధన ఉంటే అది సాధ్యమే. మీ మార్గంలో మీరు ప్రయత్నం చేయండి. ప్రయత్నాన్నే సాధన అని పిలుస్తారు.

మీకు అధికారం అంటే బాగా ఇష్టం అనుకోండి మంత్రిగారు మీకు దేవుడిగా కనబడతారు, మీకు డబ్బు అంటే ఇష్టం అనుకోండి ధనవంతులు అందరూ దేవతలుగా కనబడతారు. అందరికీ అలా కనబడరు. నీలోపల వాసన లేకపోతే ఏమీలేదు. గాంధిగారికి ప్రధానమంత్రి పదవి గడ్డిపరకతో సమానము ఎందుచేతనంటే లోపల ఆయనకు ఆ వాసన లేదు. వారు చెడ్డవారు అంటాము అనుకోండి చెడ్డతనం మనలో ఉన్నట్లు గుర్తు. లోపల చెడుతనం ఉంది కాబట్టి బయట కనిపిస్తోంది. ధ్యానం ఎవరు చేస్తారు? అహంభావన

చేస్తుంది. ధ్యానంచేసి ధ్యానంచేసి అహంభావనను పోగొట్టుకోవటం ప్రత్యక్ష పద్ధతి. ఈధ్యానం చేసేవారు ఎవరు అని విచారణ చేసి వాడిని ప్రక్కకు పెట్టటం పరోక్ష పద్ధతి. అలాగ వెళ్ళినా జ్ఞానమే, ఇలాగ వెళ్ళినా జ్ఞానమే. నీ మనస్సుకు స్థిరత్వం లేకపోతే స్థిరమైన మనస్సు ఉన్నవారిని ఆశ్రయించు. వారి సహాయ సహకారములు నీకు అందుతాయి. అప్పుడు నీ మనస్సుకు స్థిరత్వం వస్తుంది. నీ లోపల ఉన్న ఆనందం తోటి, శాంతితోటి సృష్టిలో ఏ వస్తువు సమానం కాదు. మనం గోరుతో గిల్లే విషయాలను గొడ్డలితో నరుకుతున్నాము. ఎందుచేతనంటే మనకు సరియైన అవగాహన లేదు. అనారోగ్యం వచ్చినప్పుడు జాగ్రత్తగా ఉండటంకాదు, ఆరోగ్యంగా ఉన్నప్పడే జాగ్రత్తగా ఉంటే అనారోగ్యం రాదు. నీవు కోటిరూపాయలు సంపాదించావు అనుకో నిన్ను ధనవంతుడు అంటారు. అది స్వప్న సంపద. ఇతరుల క్షేమంకోసం, సమాజ అభివృద్ధికోసం ధనం ఉపయోగిస్తే అది నిజమైనసంపద. నీ శరీరం మరణించాక నీ కూడా వచ్చే సంపద. నీ కోసం దాచుకొన్న సంపద నీకూడా రాదు. ఇతరుల క్షేమం కోసం ఉపయోగించిన సంపద నీకు అక్కరలేదు అని అనుకొన్నా అది నీ కూడా వచ్చేస్తుంది. అది నిజమైన భాగ్యం.

నీకు ఎక్కడైతే ఇష్టం ఉందో, ఎక్కడైతే ప్రీతి ఉందో అక్కడ నీ మనస్సును నిలబెడితే మనస్సుకు ఏకాగ్రత వచ్చేస్తుంది. నీకు యండగండిలో ఉన్న దేవుడి మీద ప్రేమ ఉంది అనుకో అక్కడే నీ మనస్సును నిలబెట్టు. అప్పడు పునర్జన్మను తీసుకొనివచ్చే వాసనలను బలవంతంగా నెట్టనక్కరలేదు. వాటి అంతట అవే తొలగిపోతాయి. నీకు ఏ దేవుడయితే ఇష్టమో ఆ దేవుడిమీద ఉన్న ప్రేమను, భక్తిని కాపాడుకో. ఆయనమీదే తలంపు పెట్టుకో అప్పడు అక్కరలేని తలంపులు తగ్గిపోతాయి. ఆయన మీదే ధ్యాస పెట్టుకొని అభ్యాసం చేయగా చేయగా నీధ్యాస ధ్యానంగా మారుతుంది. నీలో ఉన్న వాసనలు రానియ్యి కాని నీవు ఈశ్వరుడి మీద ధ్యాస విడిచిపెట్టవద్దు. మీలో ఉన్న వాసనలకు మీరే బలం ఇస్తున్నారు. బలం ఇవ్వకపోతే అవేపోతాయి. వాసనలకు బలం ఇచ్చేదీ మీరే వాటిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేసేది మీరే. వాటికి బలం ఇవ్వకపోతే వాటి అంతట అవే ఎండిపోయి రాలిపోతాయి. నీ హృదయంలో ఉన్న ఈశ్వరుడు నూటికి నూరుపాళ్ళు సత్యం. బయట కనిపించే గొడవలు అన్నీ మనస్సు కల్పించినవే. నీ మాట, నీ ప్రవర్తన అసహజంగా ఉంటేదాని మీద దుమ్ము చల్లటం మానేసి నీ హృదయంలో ఉన్న నిజంమీద దుమ్ము చల్లుతానంటావేమిటి? నీ దేహయాత్రలో సుఖం, దుఃఖం ఎదురుఅవ్వవచ్చు కాని వాసుదేవుడిని మిస్ అవ్వవద్దు. ఎందుచేతనంటే ఆయన నిజం, ఈ సుఖదుఃఖాలు అనిజం. వీటిని దృష్టిలో పెట్టుకొని వాసుదేవుడిని మర్చిపోవద్దు.

**నిత్యంకానిది నిత్యంగా కనిపిస్తున్నంత కాలం అందులో నుంచి విడుదల పొందటానికి సాధన చెయ్యాలి**

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 2-4-2001, పాలకోడేరు**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఈ రోజు శ్రీరామ నవమి. రాముడి శరీరం భూమిమీదకు వచ్చిన రోజు. రాముడు అంటే ఎవరో కాదు మనం ఏ వస్తువును తెలుసుకోవాలని ప్రయత్నం చేస్తున్నామో ఆ వస్తువే రాముడు. బయటకు నరుడుగా కనిపిస్తాడు లోపల ఆత్మగా ఉన్నాడు. అంటే మనం కూడా అలా జీవిస్తే లోపల ఉన్న వస్తువు తెలియబడుతుంది అని చెప్పటం. అది మనం గుర్తించాలి. ఆయన దశరధుడు కుమారుడు అని అనుకొంటే మనం మిస్ అయిపోతాము. బయటకు నరుడిగా కనిపిస్తున్నాడు కాని ఆయన నరుడు కాదు. మన హృదయంలో ఉన్న పరమాత్మే ఆ రూపంలో వచ్చింది అని మనం గుర్తించాలి. రామనామం ఎంత గొప్పది అంటే మీరు ఏదైనా పొరపాటు చేస్తే శ్రీరామ, శ్రీరామ అని అనుకొంటే ఆ దోషం నుండి బయటకు వచ్చేస్తారు. రామనామం అంత పవిత్రమైనది. ఓ రామా! శ్రీరామా! నిధి సుఖమా? నీ సన్నిధి సుఖమా? అంటాడు త్యాగరాజు. ఆత్మసుఖం తప్పించి మిగతా సుఖాలు సుఖంగా నీకు కనిపించినా అవి పరిణామంలో దుఃఖంను తీసుకొని వస్తాయి. రక్షించేది రామాయణం. ఇక్కడ కథ ఎవరైనా చిన్న అపకారం చేస్తే వారిమీద దీర్ఘ కోపం పెట్టుకొంటాము. కాని రాముడు కైకేయి మీద కోపం పెట్టుకోలేదు. నా దేహప్రారబ్దం అలాగ ఉంది కాబట్టి భగవంతుడు కైకేయితో అలా మాట్లాడించాడు అని అనుకొన్నాడు. ఇంతమంది రాక్షసులతో మనకు పేచీ ఎందుకు అని సీతమ్మ ఆయనతో అన్నప్పుడు ఈ దేహము భూమిమీదకు ఎందుకు వచ్చింది అంటాడు రాముడు. రాముడి మాట అర్థం చేసుకొంటే సంసార రోగంలోనుండి బయటపడతాము. శరీరానికి రోగం వస్తే ఆ రోగం తగ్గించుకోవటానికి మనకు ఒక ఎకరం ఉన్నా అమ్మేసి హైదరాబాద్, మద్రాసు వెళతాము. మరి సంసార రోగంలో నుండి విడుదల పొందటానికి మనం ఏమి ప్రయత్నం చేస్తున్నాము. సంసారం కూడా ఒక రోగమే. ఈ సంసార రోగంలో నుండి విడుదల పొందటానికి కొంతమంది ప్రవక్తలు చెపుతూ ఉంటే వినేవారు ఎంత శ్రద్ధగా వింటారు అంటే వారి శరీరంలో ఉన్న అవయవాలన్నీ చెవులుగా చేసుకొని వింటారు. అంత శ్రద్ధగా శ్రవణం చేయాలి. అంత శ్రద్ధగా ఎవరు శ్రవణం చేస్తారు అంటే తత్వజ్ఞానం యొక్క విలువ తెలిస్తే, దాని వైభవం మనకు తెలిస్తే అంత శ్రద్ధగా శ్రవణం చేయగలము. రాముడి యొక్క వైభవం త్యాగరాజుకు, రామదాసుకు తెలిసినట్లు మనకు తెలియదు. ఎందుచేతనంటే మనకు అంత భక్తి లేదు, శ్రద్ధ లేదు. కొంతమంది రామభక్తులు భక్తి గురించి ఎంత గొప్పగా చెపుతారు అంటే రామా నీయందు మాకున్న భక్తికంటే ముక్తి గొప్పది అని ఎవరైనా చెపితే వారు మూర్ఖులు కదా అనే రామభక్తులు ఉన్నారు, వారు ముక్తికంటే రామునియందు భక్తికి అంత ప్రాముఖ్యత ఇచ్చారు. రామనామం హృదయపూర్వకంగా

స్మరించగా, స్మరించగా సంసార రోగం నుండి విడుదల పొందుతాము. మనకు ఎంతసేపు దేహంతోటి, మనస్సుతోటి తిరగటమే పని. దేహం గొడప, మనస్సు గొడవ కలిస్తేనే సంసారం, సంసారం అంటే ఇంట్లో మనుషులు కాదు. దైవస్మరణ లేకుండా సంసారోగంలో నుండి బయట పడలేము.

నీకు సినిమాకు వెళ్ళే అలవాటు ఉంది అనుకో ఆ అలవాటు నుండి బయటకు రావటానికి ఎంతో సాధన చేస్తేగాని బయటకు రాలేవు కదా. దేహమునేను అనే బుద్ధి కొన్నివేల జన్మల నుండి వస్తోంది. అది ఒక్క రోజులో పోతుంది అనుకొంటున్నావా? దానికి ఎంతో ప్రయత్నం అవసరం. సమాధిస్థితిని ప్రాక్టీసు చేయటం వలన, దైవానుగ్రహం వలన అది పోవలసిందే గాని నీ కుప్పిగంతుల వలన అది పోదు అన్నారు స్వాములవారు. మనం సమాధిస్థితిని అభ్యాసం చేయాలి. సాధన లేకుండా సమాధి స్థితి రాదు. సమాధి స్థితి వస్తేనే గాని దేహబుద్ధి నశించదు. దేహబుద్ధి నశిస్తేనేగాని నీకు ఆత్మబుద్ధి కలుగదు, ఆత్మసుఖం నీకు అందదు. నాకు మోక్షం కావాలి అని ఒక భక్తుడు షిరిడీ బాబాగారిని అడిగాడు. నీ ఇంద్రియాలను, నీ మనస్సును, నీ అహంభావనను, నీ ప్రాణాన్ని, నీ బుద్ధిని నాకు ఇవ్వాలి అప్పుడు కాదా నీకు మోక్షం అన్నారు. ఆ ప్రక్కన కూర్చొన్న భక్తుడు నేను కూడా మోక్షం కోసమే వచ్చాను అని బాబాగారితో అన్నాడు. బాబాగారు నోటితో చెప్పటం కాదు ప్రతీది ప్రాక్టికల్‌గా చేసి చూపించేవారు. ఆ భక్తుడిని పిలిచి ఈ ఊరిలో ఒక ధనవంతుడు ఉన్నాడు వాడి దగ్గరకు వెళ్ళి వెయ్యి రూపాయలు అప్పు అడిగి తీసుకొనిరా అన్నారు బాబా. వాడు వెళ్ళివచ్చి నాకు అప్పు ఇవ్వనన్నాడు అని బాబాగారితో చెప్పాడు. కొంతసేపటికి ఒక ధనవంతుడు బాబాగారికి దగ్గరకు వస్తే ఆయననే ఇంతకుముందు వెళ్ళిన ధనవంతుడి దగ్గరకు వెళ్ళి వెయ్యి రూపాయలు అప్పు ఇవ్వమని తీసుకొనిరా అని చెప్పారు. వాడు వెళ్ళి వెయ్యి రూపాయలు తీసుకొని వచ్చి ఇచ్చాడు. ఇంతకు మోక్షం కావాలని అడిగిన భక్తుడు బాబాగారితో ఈ అప్పుల గొడవ ఏమిటండి? నేను మోక్షం కావాలని అడిగాను. ఇది అంతా తిరకాసు గొడవగా ఉంది నాకు ఏమీ అర్థం కావటం లేదు అని చెప్పాడు. అప్పుడు బాబా ఏమి చెప్పారు అంటే అప్పు ఇచ్చేవాడు నువ్వు తిరిగి తీర్చగలవా లేదా అని చూస్తాడు. నీవు తీర్చలేవు అని ఆయనకు తెలుసు అందువలన నీకు అప్పు ఇవ్వలేదు. ఆయన తీర్చగలడు అందువలననే ఆయనకు అప్పు ఇచ్చాడు. అప్పు ఇచ్చేటప్పుడు నీకు తీర్చగల అర్హత ఉందో లేదో చూసుకొంటాడు. అలాగే ఆధ్యాత్మికదరిద్రుడికి భగవంతుడు తెలియబడడు. నీ హృదయంలో భగవంతుడు ఉన్నాడు. కాని నీకు ఆధ్యాత్మిక సంపద లేకపోతే ఆయన నీకు ఎరుక పడడు. నీకు ఆధ్యాత్మిక సంపద ఉంటే, ఆ ఔన్నత్యం నీలో ఉంటే ఆయన నీకు తెలియబడతాడు. బొంబాయి నుండి భార్య భర్తలు బాబాగారి దగ్గరకు వచ్చారు. అమ్మా నీకు ఏమి కావాలి అని బాబాగారు అడిగారు. జననమరణముల నుండి నన్ను విడుదల చేయండి, చావులేనిస్థితి కావాలి అని అంది. చావటానికి ఇంత దూరం వచ్చావా అన్నారు బాబాగారు. దేహభావనను విడిచి పెట్టలేకపోవటం

వలన చావు గుర్తుకు వస్తోంది. నీకు దేహభావన ఉంది అందువలన నేను చనిపోతున్నాను అనుకొంటున్నావు. నీకు దేహభావన ఉన్నంత కాలం నీకు చావు రాకూడదు అనుకొన్నా నీవు చనిపోతావు. నీవు ఆత్మభావనను పెంచుకోవాలి అని బాబాగారు చెప్పారు. దేహభావన నశించాలంటే అది మామూలుగా నశించదు. ఆత్మభావన పెంచుకోవాలి, చైతన్యభావన పెంచుకోవాలి అన్నారు బాబాగారు. నేను ఆత్మను, నేను ఆత్మను అని అనుకొంటే అయిపోతానా. అనుకోవటం వేరు, అవ్వటం వేరు కదా అని ఆ అమ్మాయి అడుగుతోంది. నీవు అనుకోవటం ప్రారంభించు, సాధన ప్రారంభించు. నీవు సాధన ప్రారంభిస్తే, ఆత్మభావన ప్రారంభిస్తే భగవంతుడు నీకు సత్పురుషులతో అనుబంధం ఏర్పరుస్తాడు. సత్పురుషులతో అనుబంధం వలన ఆత్మభావన నీకు స్థిరపడుతుంది. అప్పడు నీకు చావు ఎక్కడ ఉంది, పుట్టుక ఎక్కడ ఉంది అంటున్నారు బాబాగారు. బొంబాయి తిరిగి వెళ్ళిపోయిన తరువాత భార్య భర్తతో మనం అనుకొన్న పని అయిపోయింది, బాబాగారిని చూసి వచ్చాము అని చెపుతుంది. అప్పడు భర్త ఏమి చెపుతున్నాడు అంటే బాబాగారిని చూడటం వేరు, బాబాగారిని భగవంతుడు అని నమ్మటం వేరు. బాబాగారిని భగవంతుడు అని నమ్మినప్పడు కదా ఆయన చెప్పిన వాక్యాలకు విలువ ఇస్తావు, సాధన చేస్తావు, తరిస్తావు. చూసివచ్చినంత మాత్రం చేత పని పూర్తి అవ్వదు. ఆయన భగవంతుడు అని నమ్మాలి కదా, ఆ విశ్వాసం కుదరాలి కదా అంటున్నాడు భర్త. నరుడై పుడితే సరిపోదు. నరుడు నారాయణుని నిరంతరము స్మరించగా, స్మరించగా నారాయణుడు అవుతాడు. స్మరణ వలన వచ్చే భాగ్యం అది. దేహం, మనస్సు నీకు స్వాధీనంలోనికి రావాలి, నీకు బానిసగా ఉండాలి, వాటికి నీవు బానిసగా ఉండకూడదు. వాటి ఆలజడి తగ్గిపోతే, నీ బుద్ధి స్థిరపడితే నీవు దేహమాత్రుడివి కాదు, నీవు బ్రహ్మమే అని నీకు తెలుస్తుంది. నీవు రోజూ ఎంతోకొంత స్వార్థం లేకుండా పనిచేస్తూ ఉంటే, ఇతరుల క్షేమం కోసం పనిచేస్తూ ఉంటే నీ ఇంద్రియాలు స్వాధీనంలోనికి వస్తాయి, ఈశ్వరానుగ్రహం వస్తుంది.

పూజ, జపం, ధ్యానం చేసి నీవు బాగుపడు. నిన్ను చూసి పదిమంది బాగుపడతారు. మీలో ఎవరైనా భౌతికంగా కాని, ఆధ్యాత్మికంగాకాని బాగుపడుతున్నారు అనుకోండి అది చూసి నాకు అసూయ వస్తే ఇంకా నాకు దేవుడు ఏమిటి? అసూయలో నుండి విడుదల పొందనప్పడు ఇంక జ్ఞానం ఎలా వస్తుంది? ఎన్ని పూజలు చేస్తేమటుకు ఏమి లాభం. నామాల్లో, రూపాల్లో, గుణాల్లో తేడాగాని లోపల ఉన్న సద్వస్తువు ఒక్కటే. నీ హృదయంలో ఉన్న వస్తువును చూడటం మానివేసి నీ గుణాన్నికాని, నీ ధనాన్నిగాని, నీ రూపాన్నిగాని, నీ గౌరవాన్నిగాని చూస్తున్నాను అనుకోండి నాకు నిజమైనచూపు లేదని అర్థం. నిజమైనచూపు లేనివాడికి ఈశ్వరానుగ్రహం సున్న, నిజం వాడికి తెలియదు. అసూయ, కోరిక, కోపం, చిరాకు ఇవి అన్నీ తలంపులే, ఇవి ఉపయోగంలేని తలంపులు. అవే సంసారం తీసుకొని వస్తున్నాయి. భగవంతుని నామం తీసుకొని శ్రద్ధగా, భక్తిగా జపం చేయటం వలన కోరిక, కోపం, అసూయ ఇవి అన్నీ పోతాయి, ఉపయోగంలేని తలంపులు ఆగిపోతాయి. ఏదైతే జపం చేస్తున్నావో ఆ

తలంపు ఒక్కటే నిలబడుతుంది. జపం చేయగా చేయగా ఆ తలంపుకూడా ఊడిపోతుంది. అప్పుడు నీ హృదయంలో ఉన్న మహావెలుగులో ప్రవేశిస్తావు. జపం నిన్ను అంతదూరం తీసుకొనివెళుతుంది. బాహ్య పరిస్థితులు నీకు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా వాటి ప్రభావం నీ మనస్సుమీద పడినప్పుడు నీకు జ్ఞానం కలుగదు. అది దేహ ప్రారబ్ధం. దేహ ప్రారబ్ధానికి. జ్ఞానానికి ఏమి సంబంధం లేదు. బయటున్న శత్రువులను జయించాలంటే శారీరక బలం, తుపాకులు ఉంటే సరిపోతాయి. లోపల ఉన్న శత్రువులను జయించాలంటే మనస్సుతో ఎక్కువ ప్రయత్నం చేయాలి. బయట శత్రువులను జయించటం కంటే లోపల శత్రువులను జయించటం చాలా కష్టం. మనస్సును శాంతపర్చుకోవాలి, మనస్సును నిర్మలం చేసుకోవాలి. అప్పడుగాని లోపల ఉన్న శత్రువుల నుండి బయటపడలేము. జపం, ధ్యానం, విచారణ ఇవి గమ్యం కాదు, ఇవి సాధనలు మాత్రమే. లోపల ఉన్న చైతన్యంతో కలవటానికి ఇవి అన్నీ ప్రయత్నాలు మాత్రమే. ప్రయత్నంలో బంధం ఉంది. ప్రయత్నం చేస్తూ, చేస్తూ ప్రయత్నం లేని స్థితికి వెళితే అప్పుడు బంధం నిన్ను విడిచిపెట్టేస్తుంది. బ్రహ్మానుభవం పొందటానికి ఏ తెర అయితే మనకు అడ్డు వస్తోందో ఆ తెరను తొలగించటానికే జపం, ధ్యానం, విచారణ. ఎన్ని శాస్త్రాలు చదివినా, ఎన్ని పురాణాలు విన్నా అన్నింటికంటే మనోనిగ్రహం ముఖ్యం. మనోనిగ్రహం లేకపోతే లోచూపురాదు. లోచూపు ప్రాంభమయితే నిజమైన విద్య ప్రారంభమవుతుంది. అప్పడు నీవు నిజమైన విద్యావంతుడవు అవుతావు. దేహాన్ని ప్రారబ్ధానికి విడిచిపెట్టు. సినిమా తెరమీద ఆడేవారు బాగా ఆడేట్టుగా డైరెక్టర్ చేస్తాడు అలాగే మన దేహ ప్రారబ్ధాన్నిబట్టి మన ఆట బాగా ఆడి బయటకు వెళ్ళిపోతే గొడవ వదిలిపోతుంది. ఎవరికి ఏది ఇచ్చినా భగవంతుని స్మరించి ఇయ్యి. ఒక మనిషితో మాట్లాడితే వాడిలో భగవంతుడు ఉన్నాడు అని, బయటకు కనిపించే రూపం నిజం కాదు అనుకొని మాట్లాడు. మనం చేసే పొరపాటు ఏమిటి అంటే మనం జీవిస్తే భూతకాలంలోగాని, భవిష్యత్ కాలంలోగాని జీవిస్తున్నాము. దీనివలన వర్తమాన కాలాన్ని పాడుచేసుకొంటున్నాము. సాధన చేసేటప్పుడు బహు జాగ్రత్తగా ఉండాలి. నిత్యం కానిది నిత్యంగా కనిపిస్తున్నంత కాలం అందులో నుండి విడుదల పొందటానికి బహు జాగ్రత్తగా ప్రయత్నం చేయాలి. కృషి లేకుండా కృప ఎలాగ వస్తుంది. వెయ్యి రూపాయలు అప్పు ఉంది అనుకోండి. 999 రూపాయలు అప్పు తీర్చారు అనుకోండి. ఒక్క రూపాయి ఉండిపోయింది అనుకోండి. ఆ ఒక్క రూపాయి వెయ్యి రూపాయలు అయిపోతుంది. అలాగే అన్ని వాసనలు పోయి ఒక చిన్న వాసన మిగిలింది అనుకోండి. దానిని నిర్లక్ష్యం చేస్తే అది పెరిగిపోతుంది. అందుచేత ఒడ్డుకు రావాలి, వచ్చాము అనుకోవాలి. అందువలన సాధనలో బహుజాగ్రత్త అవసరము. మన కూడా నీడ వస్తుంది. నీడను రావద్దు అన్నా ఆగదు వచ్చేస్తుంది. అలాగే భగవంతుని ప్రేమగా, శ్రద్ధగా, భక్తితో స్మరించుకొంటున్నావు అనుకో నీకూడా శాంతిని రావద్దు అన్నా శాంతి నీ వెంట వచ్చేస్తుంది అని బాబా చెప్పారు.

# అద్వైతానుభవం కలిగాక సంకల్పించేవాడు, సాధన చేసేవాడు ఉండడు

సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భషణములు, 25-3-2001, కోపెల్ల

ప్రియమైన ఆత్మ బంధువుల్లారా,

దేహము చనిపోయిన తరువాత దేహము, జీవుడు విడపోతారు. ఒక మహాశక్తి దేహాన్ని ఈ భూమిమీదకు తీసుకొని వచ్చింది. ఏ శక్తి అయితే ఈ దేహాన్ని భూమిమీదకు తీసుకొని వచ్చిందో, ఏ పని నిమిత్తం తీసుకొని వచ్చిందో ఆ పని పూర్తిఅయిన తరువాత జీవుడిని దేహంతో సెపరేట్ చేస్తుంది. దేహం స్మశానంలో కాల్చబడుతుంది, జీవుడు ప్రయాణం చేస్తాడు. మనం దేహం గురించి ఎంత ఆలోచిస్తున్నామో అందులో సంగంకూడా దేహం చనిపోయిన తరువాత ప్రయాణించే జీవుడి గురించి ఆలోచించుటంలేదు. మనకు ఆ అలవాటు లేదు. మన ఆలోచన ఒక క్రమంగా లేదు. మన గురించి మనం ఆలోచిస్తాము, లేకుంటే ఇతరులు మన గురించి ఏమి అనుకొంటున్నారు అని ఆలోచిస్తాము. ఈ ఆలోచన పొరపాటు. నేను ఇలాగ ఉన్నాను, నేను అలాగ ఉన్నాను, నాకు ధనం ఉంది, నాకు కీర్తిఉంది అనుకొనేవాడికి జ్ఞానంరాదు. మనం దేనితో ఒకదానితో తాదాప్యం చెందకుండా ఉండలేము. ఆ తాదాప్యం తెగటానికే సాధన. భగవంతుడు మోక్షం ఇచ్చేటప్పడు మీఇంట్లో ఉన్న సంపదను చూడడు, మీ హృదయంలో ఉన్న సంపదను చూస్తాడు. భగవంతుడు మన గురించి ఏమనుకొంటున్నాడో అది కావాలిగాని మనగురించి మనం ఏమనుకొంటున్నాము లేకపోతే ఇతరులు మనగురించి ఏమనుకొంటున్నారు దానినిబట్టి మోక్షం ఇవ్వడు. అద్వైతానుభవం కలిగాక సంకల్పించేవాడు, సాధన చేసేవాడు ఉండడు. అద్వైతానుభవం నిజంగా ఎవరైనా కలిగిఉంటే వాడు ప్రత్యక్షంగా ఎంతోకొంత ఇతరులకు తన అనుభవాన్ని అందించగలడు, ఆధ్యాత్మికంగా సహాయం చేయగలడు. లోపల ఉన్న వస్తువు తాలుక శాంతి నీ సహస్రారంలోనికివచ్చి చిమ్మటానికి సిద్ధంగా ఉంది. అది వ్యక్తంకాకుండా ఎవరో అడ్డు రావటంలేదు మనకు మనమే అడ్డుపడుతున్నాము. అదే దేహభావన. నీవుకాని వస్తువును నీవు అనుకొంటున్నావు. అధే ప్రధమ దోషం, అదే మధ్య దోషం, అదే చివరి దోషంకూడా. నీవుకాని వస్తువును నీవు అనుకొనే ధ్యాసే లోపలున్న వస్తువు నీకు వ్యక్తం కాకుండా ఆపుచేస్తోంది. బ్రహ్మం లోపలఉంది, అది వ్యక్తం అవ్వటానికి సిద్ధంగా ఉంది. కాని మనకు ఆ ప్రిపరేషన్ లేదు, అంత పవిత్రత లేదు.


స్వార్ధబుద్ధి ఉన్నవాడి దగ్గరనుండి ప్రేమ, శాంతి ఆశించకు, అల్పబుద్ధి ఉన్నవాడి దగ్గరనుండి బాధ్యత ఆశించకు అని పెద్దలు చెపుతారు. మీకు అందరికి జ్ఞానం వస్తుంది

కాని చాలాకాలం పట్టవచ్చు. దురదృష్టం ఏమిటంటే చాలామంది ఇన్‌ఫర్‌మేషన్ జ్ఞానం అనుకొంటున్నారు. స్థూలబుద్ధి ఉన్నవాడు సబ్జక్టు సరిగా అర్థం చేసుకోలేడు, వాడికున్న భక్తికూడా శాంతంగా ఉండదు. సూక్ష్మబుద్ధి ఉన్నవాడు సబ్జక్టు బాగా అర్థం చేసుకొంటాడు, వాడి భక్తి స్పష్టంగా, స్వచ్ఛంగా ఉంటుంది. నీ స్వరూపాన్ని అనుసంధానం చేసుకోవటం, నీవు ఎవరిగా ఉన్నావో నిరంతరం గుర్తుపెట్టుకోవటం నిజమైన భక్తిఅని ఆచార్యులవారు చెప్పారు. మనకు భగవంతుడిపట్ల పరిపూర్ణమైన విశ్వాసం ఉండాలి. నాకు భౌతికమైన విషయాలు ఏమీవద్దు. మోక్షస్థితి గురించికూడా నేను కంగారు పడటంలేదు. కాలపరిణామంలో అది ఎప్పుడు రావాలో అప్పుడువస్తుంది. కాని కృష్ణా నిన్ను కోరేది ఒక్కటే నీయందు నాకున్న భక్తి చలించకుండా నన్ను అనుగ్రహించు అని కృష్ణచైతన్యుడు కృష్ణుడిని ప్రార్థించాడు. మనిషిన పట్టిపీడించేది అహంభావన. అది దేహాన్ని పోగొట్టుకోవటానికి ఇష్టపడుతుంది గాని అది పోవటానికి ఇష్టపడదు. మనలను మనం పొగడుకోవటం వలన, ఇతరులను నిందించటం వలన అహంభావన పెరుగుతుంది. మనం ఎవరినైతే విమర్శిస్తున్నామో వారు లాభం పొందుతారు, మనం నష్టపోతాము అని విమర్శించేవారికి తెలియదు.

ఎక్కడికి వెళ్ళినా సాధారణంగా ఏవో సమస్యలు చెపుతూ ఉంటారు. కుటుంబ సమస్యలు, ఆర్థిక సమస్యలు, సామాజిక సమస్యలు ఇవిఅన్నీ నిజమైన సమస్యలుకావు. మనస్సే నిజమైన సమస్య, అది మనం మర్చిపోతున్నాము. దేహం కొత్తగా వచ్చిందిగాని మనస్సు అనేక వేల జన్మలనుండి వస్తోంది. దానిని మార్చుకోవటానికి మనం ప్రయత్నం చేస్తున్నాము. అది మారినట్లు నటిస్తోందిగాని మారటంలేదు. మారు మనస్సు పొందటం చాలాకష్టం, అది తొందరగా మారదు. మనస్సు ఖాళీ చేసింది అనుకో ఆత్మజ్ఞానాన్ని నీవు పిలవనక్కరలేదు. మనస్సు ఖాళీఅయిన మరుక్షణంలో ఆత్మజ్ఞానం వచ్చి ప్రవేశిస్తుంది. అహంభావనకు సంబంధించిన వ్యాపారం తగ్గించుకోండి. మన ఇంట్లోవారిమీద మనకు ప్రేముంది అనుకొంటున్నాము అది ప్రేమకాదు, అది స్వార్థమే. స్వార్థంకూడా ప్రేమ అనుకొనేటంత అమాయకస్థితిలో మనం ఉన్నాము. టెక్నాలజీ అభివృద్ధి అవుతోందిగాని మనం మానసికంగా అభివృద్ధి అవ్వటంలేదు. దానికి దీనికి పొందిక కుదరటంలేదు. నిజంగా నీకు ఈశ్వరునిపట్ల ప్రేమఉంటే ప్రశ్నలే ఉదయించవు, సందేహాలురావు. జంతు జన్మలు, మనిషి జన్మలు, దేవతా జన్మలు ఇలా నీవు కోట్లాది జన్మలు ఎత్తుగాని నీకు పరమ శాంతి, శాశ్వతమైన శాంతి కావాలంటే నా దగ్గరకు రావలసిందే, నీ శాంతిస్థానం నేనే అని భగవంతుడు చెపుతున్నాడు. మూలతలంపును ఎలా పోగొట్టుకోవాలి అని అడుగుతున్నారు. మూలతలంపును పట్టుకొని దానిమూలంలోనికి వెళ్ళు అది ఒక మార్గం. నీకంటే ఉన్నతమైన శక్తి ఒకటిఉందని నమ్మటం

వలన, నమ్మటమేకాదు అది చెప్పినట్లుగా భక్తితో చేయటం వలన కూడా మూలతలంపు పోతుంది. ఇదొక మార్గం. నీకు అనుకూలమైన సంఘటనలు వచ్చినా, ప్రతికూలమైన సంఘటనలు వచ్చినా భగవంతుడు ఇచ్చిన ప్రసాదంగా తీసుకొని ముందుకు దూసుకొనిపో. నీవు ఏ మార్గంలో ప్రయాణం చేసినా దేహ ధ్యాసలోనుండి విడుదల పొందాలి. భగవంతుడిని నిరంతరం స్మరించటం వలన మనకు తెలియకుండానే మూలతలంపు పోతుంది. అది పోవటం ఆ స్థలంలో ఈశ్వరుడు నిలబడటం ఒకేసారి జరిగిపోతాయి. అహంభావన ఎందుకు పనికిరానిది అని ముందు నీకు అర్థం అవ్వాలి. అది చాలాగొప్పది అనుకొంటే అది ఎక్కడికి పోతుంది. అహంభావనలోని అల్పత్వం, ఈశ్వరుడిలోఉన్న శక్తి ముందు నీకు తెలియాలి. అప్పడు నెమ్మది, నెమ్మదిగా అహంభావన అణగటం ప్రారంభిస్తుంది. సత్కర్మ ఆచరణ, సద్గ్రంధపఠనం, సత్పురుషులతో సహవాసం ఎన్నో జన్మలు చేస్తేగాని నీకు లోచూపు కలుగదు. లోచూపు కలిగినవాడు హృదయంలో ప్రవేశిస్తాడు. హృదయంలో ప్రవేశించినవాడికి కదా ఈశ్వరుడు తన స్వరూపంగా వ్యక్తమయ్యేది.

నీలోఉన్న దోషాలు చెప్పవు, ఇతరులలో ఉన్న దోషాలు చెపుతావు. నీవు బుద్ధిమంతుడవా? నీకు జ్ఞానం ఎలావస్తుంది. ఇంట్లోవారికి పది రూపాయలు ఇస్తే అది త్యాగం అనుకోవు, అదే బయటవారికి ఇస్తే త్యాగం అనుకొంటావు. స్వపర బేధం వచ్చింది ఇంక నీకు జ్ఞానం ఏమిటి? ఎవరైనా మి సహకారం తీసుకొంటే వారు ఉద్ధరింపబడిపోతున్నారు అనుకోకండి, మీరు పవిత్రులు అవ్వటానికి సహకరిస్తున్నారు అనుకోండి నీ జీవితంలో ఒక మాధుర్యం ఉంది, నీ హృదయంలో ఒక తియ్యదనం ఉంది. అది నీవు అనుభవించాలంటే నీ జీవితంలో జరిగిన సంఘటనలు అన్నీ పూర్తిగా మార్చిపోవాలి. ఆ మర్చిపోయే సమర్ధత నీకు ఉండాలి. అప్పడు కదా నీ హృదయంలో ఉన్న తియ్యదనం నీకు అందేది. అహంభావనను అలంకరించటం మానివెయ్యి. ఈశ్వరుడిని అలంకరిస్తే ఆయన అనుగ్రహం నీకు వస్తుంది. ఆ అనుగ్రహ ప్రవాహంలో దేహధ్యాస పోతుంది. నీకు ఏ మార్గంలో ప్రయాణం చేయాలని అనిపిస్తే ఆ మార్గంలో ప్రయాణం చెయ్యి, ప్రయాణం మటుకు ప్రారంభించు. ఏ భావన అయితే దేహంతో తాదాప్యం చెందుతొందో ఆ భావనను తీసుకొనివెళ్ళి ఎక్కడ లయింపచేయాలో చూసుకో. అది మర్చిపోవద్దు. మీకు సరిఅయిన అవగాహన ఉంటే ఇప్పడే ఇక్కడే వస్తువు అనుభవంలోనికి వస్తుంది. మీకు సరిమైన అవగాహన లేకపోతే లోపల ఉన్న వస్తువు మాట అటు ఉంచండి మంచివారు కూడా చెడ్డవారిగా మీకు కనిపిస్తారు. అందువలన బహు జాగ్రత్త అవసరం.



**కీ॥శే॥ ఉద్దరాజు ఆనందరాజు గారు**

**శుభాకాంక్షలతో**

ANANDA GROUP

**ఉద్దరాజు విశ్వనాధరాజు**


ఛైర్మన్ : ఆనంద గ్రూప్

27-8-21/3, శివరావుపేట, **భీమవరం** - 534 202


ప॥గో॥ జిల్లా, ఆంధ్రప్రదేశ్

☎ Off: 91 - 8816 - 22448, 23981, 23983 Fax : 23984

E Mail : uddaraju@gaismd01.vsnl.net.in



శ్రీ రమణాశ్రమం, తిరువన్నామలై



ఆంధ్రాశ్రమం, తిరువన్నామలై



శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు

REGISTERED NEWS PAPER    RNI NO. APTEL/1999/1667-POSTAL REGN.NO. AP/VJA/32/5/2000



To

**A. Lakshmi**
Plot No. 150, Rao & Raju Colony
Banjara Hills, Road No. 2
HYDERABAD - 500 034

*If undelivered please return to :*

**RAMANA BHASKARA**
SRI RAMANA KSHETRAM,
**JINNURU - 534 265.** W.G. Dt. A.P.

Editor, Printer, Publisher : **P.S. RAMA RAJU**
Lakshmi Modern Rice Mill, Ullamparru, PALAKOL - 534 260. W.G. Dt. ☎ : 08814-24589, 24689
Printed at : **SHRIRAM GRAPHICS**, Bank Street, PALAKOL - 534 260. W.G. Dt. ☎ : 22438, 24278